క్లుప్తంగా

మావుళ్లమ్మకు విశేష పూజలు



భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీ మావుళ్లమ్మ అమ్మవారికి వైజాగ్‌కి చెందిన ఈమని సూర్య సంపత్ అమ్మవారికి భారీ గజ మాల సమర్పించారు. వీరికి ఆలయ ఉపప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం నిర్వహించినారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ వీరికి ప్రసాదాలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా రథయాత్ర



భీమవరంలో రథయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్) : భీమవరంలో బుధవారం జగన్నాథ రథయాత్ర ఘనంగా నిర్వహించారు. ఇస్కాన్ భీమవరం శాఖ ఆధ్వర్యంలో పంచారామ క్షేత్రం వద్ద నుంచి అల్లూరి సీతారామరాజు స్మృతి వనం వరకు జగన్నాథ రథయాత్రను వైభవంగా నిర్వహించారు. ఈ రథయాత్రలో ఇస్కాన్ నిర్వాహకులు భక్తులు పాల్గొన్నారు.

4న వైఎస్సార్ సీపీ సమావేశాన్ని విజయవంతం చేయాలి



సీహెచ్ సత్యనారాయణ

వీరవాసరం: భీమవరంలో ఈ నెల 4న జరిగే వైఎస్సార్ సీపీ సమావేశాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి బుధవారం కోరారు. పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం 02:30 గంటలకు ఆనంద ఫంక్షన్ హాల్ జువ్వలపాలెం రోడ్ భీమవరం నందు బాబు షూరిటి మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావలసిందిగా వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులు అందరూ పాల్గొవాలని ఆయన కోరారు.


పేరంటాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



పేరంటాలమ్మ అలయ ప్రాంగణంలో హుండీ లెక్కిస్తున్న దృశ్యం

ఉండి: మండలంలోని వెలివర్రు వీరపేరంటాలమ్మ అమ్మవారి హుండీ ఆదాయం రూ.7.06 లక్షల వచ్చినట్లు ఇన్‌ఛార్జ్ ఈఓ తోట శ్రీనివాస రావు తెలిపారు.బుధవారం ఆలయ ప్రాంగణంలో భీమవరం దేవాదాయశాఖ తనిఖీదారు వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించామని, ఐదు నెలల 20 రోజుల తర్వాత హుండీ ఆదాయాన్ని లెక్కించామని తెలిపారు. అమ్మవారి జాతర మహోత్సవాలు, ఉగాది పర్వదిన పండుగల ఆదాయం కూడా ఇదే హుండీ ఆదాయంలో ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఈఓలు ఎం.సత్యనారాయణ, డీవీ కృష్ణంరాజు, ఎంవీ రామాంజనేయరాజు, ట్రస్టు బోర్డు చైర్మన్ గాదిరాజు వెంకట్రాజు, మాజీ చైర్మన్‌లు ముదునూరి వీర్రాజు, ముదునూరి రంగరాజు, మంతెన రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులు రాజీ చేసుకోవాలి



భీమవరంలో విలేకర్లతో మాట్లాడుతున్న జడ్జి లక్ష్మీనారాయణ

భీమవరం: జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకుని కేసులను రాజీ చేసుకోవాలని భీమవరం మూడవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ బి లక్ష్మీనారాయణ అన్నారు. ఈనెల జూలై 5వ తేదిన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జడ్జి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడితే ఇరువురూ గెలిచినట్లేనన్నారు. లోక్ అదాలత్‌లో అన్ని సివిల్ కేసులు, రాజీకాదగిన క్రిమినల్, చెక్కు బాకీ, మోటార్ యాక్సిడెంట్, ఇన్సూరెన్స్, మనోవర్తి, గృహహింస వంటి కేసులను రాజీ చేసుకోవచ్చునన్నారు. సివిల్ కేసుల్లో రాజీ పడితే అప్పటికే కట్టిన కోర్టు ఫీజు వాపసు వస్తుందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల రాజీకి అన్ని కోర్టుల్లో ప్రత్యేకంగా బెంచ్‌లను ఏర్పాటు చేశామని వివరించారు.

సంపద సృష్టి.. సర్వం నాస్తి

- నిరుపయోగంగా చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు
- చెత్త సేకరణలో చేతులెత్తేసిన పంచాయతీలు
- రూ.కోట్ల ప్రజాధనం వృథా



కుండీలలో పేడ, తడి చెత్త వేసి ఎండగట్టిన దృశ్యం

ఆకివీడు: పంచాయతీలకు ఆదాయం సమకూర్చేందుకు, పారిశుద్ధ్య పనులు మెరుగు పరచేందుకు ఏర్పాటు చేసిన సంపద సృష్టి కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. గత ప్రభుత్వ హాయంలో ఆయా గ్రామాల్లో తడి, పొడి చెత్త వేరు చేసి, వాటి నుండి వర్మీ కంపోస్టు ఉత్పత్తి చేసేందుకు అనువుగా కుండీలు, షెడ్లు నిర్మాణం జరిగింది. నియోజకవర్గంలోని 71 గ్రామ పంచాతీల పరిధిలో సుమారు 65 గ్రామ పంచాయతీల పరిధిలో వ్యర్థాల నిర్వహణా కేంద్రాల్ని నిర్మించారు. కేంద్రాల్లో తడి, పొడిచెత్తలకు వేరు వేరుగా కుండీలను నిర్మించారు. తడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారు చేసేందుకు అనువుగా ఆయా గ్రామ పంచాయతీల పరిధిలోని సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

గుర్రపుడెక్క నుంచి కంపోస్టు తయారీ

గుర్రపుడెక్క నుంచి కంపోస్టు తయారు చేసేందుకు ఆకివీడు మండలం సిద్ధాపురం గ్రామంలో పైలట్ ప్రాజెక్టును ఎంపిక చేశారు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారులను కూడా భాగస్వాములు చేశారు. సిబ్బందికి, రైతులకు శిక్షణ ఇచ్చారు. కుండీలలో పేడను నిల్వ ఉంచి, దానిలో గుర్రపుడెక్కను కుళ్లబెట్టడం ద్వారా వచ్చే ఎరువులో వానపాముల్ని వేసి కంపోస్టు తయారు చేస్తారు. ప్రస్తుతం మండలంలో ఒక్క గ్రామంలోనే ఈ విధానం కొనసాగుతోంది.

గ్రామాల్లో విచ్చలవిడిగా చెత్త

గ్రామాల్లో పలు చోట్ల రోడ్ల వెంబడి డంపింగ్ యార్డులు తయారవుతున్నాయి. కాల్వ గట్లపైనా, రోడ్డు మార్జిన్లలో చెత్తను పారవేస్తున్నారు. తడి పొడి చెత్తల్ని వేరు చేసేందుకు గతంలో డస్ట్‌బిన్నులు ప్రతీ ఇంటికీ అందజేశారు. వాటిని ప్రజలు ఇళ్ల అవసరాలకు ఉపయోగిస్తున్నారు. చెత్తను యథావిధిగా పారవేస్తున్నారు. తడి, పొడి చెత్తల వేరు చేసే విధానానికి స్వస్తి చెబుతున్నారు. కొన్నిచోట్ల చెత్తను తగలబెడుతున్నారు. సంపద సృష్టి కేంద్రాలు గ్రామాల్లో దిష్టిబొమ్మలుగా ఉన్నాయి. ఈగలు, దోమలు, కుక్కలకు నిలయంగా మారాయి. వీటితో పాటు పలు చోట్ల అసాంఘిక కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

మండలాల్లో వేళ్లపై లెక్కించవచ్చు

సంపద సృష్టి కేంద్రలు పనిచేసేవి మండలంలో వేళ్లపై లెక్కించ వచ్చునంటున్నారు. మండలానికి ఒకటి రెండుకు మించి పనిచేస్తున్న దాఖలాలు లేవు. ఆకివీడు మండలంలో సిద్ధాపురం గ్రామం, ఉండి మండలంలో పెదపుల్లేరు, కలిసిపూడి, ఉండి, కాళ్ల మండలంలో జక్కరం, ఏలూరు పాడు, పాలకోడేరు మండలంలో విస్సాకోడేరు గ్రామాలున్నాయి.



గుమ్ములూరులో నిరుపయోగంగా ఉన్న చెత్తను వేరు చేసే కేంద్రం



చెరుకువాడలో నిరుపయోగంగా ఉన్న సంపద సృష్టి కేంద్రం



వర్మీ కంపోస్టు తయారీ ప్రాంతంలోనే తగులబెడుతున్న చెత్త

అరుణాచల యాత్రను సద్వినియోగం చేసుకోండి

భీమవరం(ప్రకాశంచౌక్): గురు పౌర్ణమికి అరుణాచల గిరి ప్రదక్షణ యాత్ర ప్రత్యేక సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. 8వ తేది మంగళవారం భీమవరం కొత్త బస్టాండ్ నుంచి రాత్రి ఏడు గంటలకు బయలు దేరి శ్రీ కాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనాలు చేయించి గురు పౌర్ణమికి అరుణాచలం చేరుకొని గిరి ప్రదక్షణ చేసుకొని తిరుగు ప్రయాణంలో కంచి కామాక్షి అమ్మవారి దర్శనం,విష్ణు కంచి దర్శనం చేసుకొని శనివారం భీమవరం చేరుకునేలా అరుణాచల గిరి ప్రదక్షణ యాత్ర స్పెషల్ సూపర్ లగ్జరీ సర్వీసు వెళ్తున్నట్లు డిపోమేనేజర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. టికెట్ రేటు ఒక్కరికీ రూ.3000, ఈ స్పెషల్ సర్వీసుకు ఆన్ లైన్ రిజర్వేషన్ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. భీమవరం పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ మంచి అవకాశం ఉపయోగించుకోవలెనని డిపో మేనేజర్ తెలియజేసారు.

అధ్వానంగా నౌడూరు జంక్షన్ బస్టాండ్

వీరవాసరం: మండలంలోని నౌడూరు జంక్షన్‌లో ఉన్న బస్టాండ్ పరిసర ప్రాంతాలన్నీ అధ్వానంగా తయారయ్యాయి. స్థానిక ప్రజల ఆర్థిక సహాయంతో సుమారు ఆరు సంవత్సరాల క్రితం నౌడూరు జంక్షన్‌లోని బస్టాండ్ నిర్మించడం జరిగింది. నిత్యం వందలాదిమంది ప్రయాణికులు రాకపోకలను ఈ బస్టాండు నుంచి వెళ్లే బస్సుల ద్వారా, ఆటోల ద్వారా, కార్లు ద్వారా ప్రయాణికులు ప్రయాణం చేస్తుంటారు. ప్రస్తుతం బస్టాండ్ ఆవరణతో పాటు బస్టాండ్ ప్రాంగణం వద్ద వర్షపు నీరు నిలబడి పోయి అధ్వాన్నంగా తయారైంది. బస్టాండ్ లో కూర్చోవాలంటేనే నానా అవస్థలు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. బస్టాండ్ ముందు భాగం వర్షం నీటితో నిండి బురదమయంగా మారి బస్సు ఎక్కే సమయంలో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి బస్టాండ్ సమస్యను, బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న అపరిశుభ్ర వాతావరణన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



అపరిశుభ్రంగా ఉన్న నౌడూరు జంక్షన్ బస్టాండ్



నౌడూరు జంక్షన్ బస్టాండ్ ముందు భాగంలో వర్షం నీరు

సీతారామరాజు అందరికీ ఆదర్శనీయుడు

భీమవరం: పిన్న వయసులోనే బ్రిటీష్ వారిని గడగడలాడించిన యోధుడు అల్లూరి సీతారామరాజు అందరికీ ఆదర్శనీయుడని యువజన సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు అన్నారు. భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద బుధవారం శ్రీవిజ్ఞానవేదిక, అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో సీతారామరాజు జయంతోత్సవాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బిజెపి నాయకులు అల్లూరి సాయి దుర్గరాజు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, వసుధ ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ తెలుగుజాతి, భారతదేశానికి గొప్ప స్ఫూర్తి ప్రధాత అల్లూరి ప్రతి మనిషి గుండెల్లో చిరకాలం ఉంటారన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సీతారామరాజు జయంతోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని అల్లూరి కాంస్య విగ్రహం వద్ద నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీతారామరాజు, సూర్యనారాయణ, ఎ అనురాధ, భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఎస్ కే చాన్ భాషా తదితరులు పాల్గొన్నారు.



భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద అల్లూరి జయంతోత్సవాలను ప్రారంభిస్తున్న దృశ్యం

వైద్య విద్యార్థులపై పోలీసుల దాడి దారుణం



ఈద జాషువా

భీమవరం: వైద్య విద్యార్థులపై పోలీసుల దాడిని వైఎస్సార్‌సీపీ మేధావుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఈద జాషువా మంగళవారం తీవ్రంగా ఖండించారు. డాక్టర్స్ డే రోజునే ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించడం దారుణయని తమ సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువవైద్యులను అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసుకుని, ఎంసీఏ పరీక్షల్లో ఉత్తీర్ణులై, ఢిల్లీ వెళ్లి సర్టిఫికెట్లు తెచ్చుకుని, ఏడాదిపాటు ఇంటర్నెషిప్ పూర్తిచేసుకుని అన్ని రకాల అర్హత సాధించిన వారికి పర్మినెంట్ రిజిస్ట్రేషన్ చేయడంలో ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏముందని జాషువా ప్రశ్నించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన మెడికల్ కళాశాలల్లో సీట్లు పెరగనీయకుండా అడ్డుకుని కేంద్రం ఇచ్చిన సీట్లు తీసుకోకుండా తిరస్కరించడం వైద్య విద్య పట్ల రాష్ట్రప్రభుత్వానికి ఉన్న చిన్నచూపు అవగతమవుతుందన్నారు. మెడికల్ కాలేజీలను తమ వాళ్లకు కట్టబెట్టే దిశగా ప్రభుత్వ పెద్దలు పావులుకదుపుతున్నారని విమర్శించారు. తక్షణమే వైద్యవిద్యార్థుల డిమాండ్లను పరిష్కరించాలని. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలి జాషువా డిమాండ్ చేశారు.

కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు

భీమవరం అర్బన్: సొంతంగా భూమిని సాగు చేసే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డు మంజూరు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి వైవీఎస్ ప్రసాద్ అన్నారు. భీమవరం మండలంలోని రాయలం, చినఅమిరం గ్రామాల్లో బుధవారం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వైవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డు కాల పరిమితి 11నెలలు మాత్రమే ఉంటుందన్నారు. అర్హులైన సొంతంగా సాగు చేసే రైతులకు, కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందన్నారు. అంతేకాకుండా కౌలు గుర్తింపు కార్డువల్ల పంట నమోదు చేసుకోవడమే కాకుండా ధాన్యం కొనుగోలుకు ఇబ్బందులు తలెత్తవన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో, వీఏఏ కె. మానిక , నీటి సంఘం ఉపాధ్యక్షుడు కోళ్ల సీతారామ్, చెరుకువాడ సతీష్, దొంగా రామకృష్ణ, గొట్టుముక్కల మురళీకృష్ణంరాజు, బుద్దరాజు శ్రీనివాసరాజు,ఎస్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.



కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న మండల వ్యవసాయాధికారి వైవీఎస్ ప్రసాద్

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

భీమవరం: లేబర్ కోడ్‌లు రుద చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవి నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం భీమవరం యుటిఎఫ్ హాలులో ఏర్పాటుచేసిన సీఐటీయూ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో అన్ని తరగతుల ఉద్యోగులు, కార్మికులను రకరకాల పేర్లతో విభజించి వారికున్న హక్కులను దక్కనివ్వకుండా అడ్డుపడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న సమ్మె చేయాలని నిర్ణయించినట్లు నాగేశ్వరరావు తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ 9వ తేదీ దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయడానికి జిల్లాలో మూడవ తేది నుంచి మూడు రోజులపాటు ప్రచార యాత్ర, 6, 7 తేదీలలో బైక్ ర్యాలీలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో బి వాసుదేవరావు, పివి ప్రతాప్, ఎస్ వెంకటేశ్వరరావు, ఎస్ రంగారావు, ఎం ఆంజనేయులు, జె శ్రీనివాస్, డి కళ్యాణి, అజయ్ కుమారి, త్రిమూర్తులు, ఎం సూరిబాబు, కె జాన్సీలక్ష్మి, సీహెచ్ లక్ష్మీ హసీనా తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికత గుర్తింపునకు ఎన్ఏబీఎల్ అక్రిడేషన్ దోహదం



భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న శ్రీకాంత్

భీమవరం: ప్రయోగశాలలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం గుర్తింపునకు నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లేబరేటరీ(ఎన్ఎబిఎల్) ద్వారానే సాధ్యమవుతుందని ఎన్ఎబిఎల్ బెంగళూరు రీజనల్ హెడ్, క్యూసిఐఆర్ డైరెక్టర్ ఆర్ శ్రీకాంత్ చెప్పారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల సివిల్‌లో మంగళవారం గున్వత్త యాత్ర అవేర్నెస్ ప్రోగ్రాం ఆన్ ఎన్ఎబిఎల్ అక్రిడేషన్ వల్ల ఉపయోగాలు అనే అంశంపై వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. పరీక్షా ఫలితాలు నిర్ధారించేందుకు ఎన్ఎబీఎల్ పరీక్షలు దోహదపడతాయన్నారు. ఎన్ఎబిఎల్ అసిస్టెంట్ డైరెక్టర్ పి శ్రీరామ్ మాట్లాడుతూ ప్రయోగశాలలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం గుర్తింపునకు ఎన్ఎబిఎల్ అక్రిడేషన్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ అక్రిడేషన్ సద్వినియోగం చేసుకుంటే కళాశాలల టెస్టింగ్ సర్వీసెస్ మరింత మెరుగుపడతాయన్నారు. ఈ వర్క్‌షాప్‌లో కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు, సివిల్ ఇంజనీరింగ్ హెడ్ జి శ్రీ బాల, ఆర్ అండ్ డి డీన్ టి వంశీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారిని బాగు చేయాలని ధర్నా

పాలకొల్లు సెంట్రల్: గోతులతో బురదమయంగా ఉన్న మట్టపర్రు రహదారిని బాగు చేయాలంటూ గ్రామస్తులు ధర్నా చేశారు. బుధవారం పోడూరు మండలం మట్టపర్రు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో రహదారిపై బైటాయించారు. దాదాపు మూడు గంటల సమయం ధర్నా నిర్వహించారు. ధర్నాతో పాలకొల్లు, మార్టేరు రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రహదారిలో నిత్యం ప్రయాణం చేయలేకపోతున్నామని నాయకులు హామీలు ఇచ్చినంత వేగంగా పనులు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆందోళన వ్యక్తంచేశారు. వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందన్నారు.

తల్లికి వందనం రెండో జాబితా ఎప్పుడు?

యలమంచిలి: తల్లికి వందనం రెండో జాబితా జూన్ 30న విడుదల చేసి జూలై 5న లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం జూలై మూడు వచ్చినా ఇంకా జాబితా విడుదల చేయకపోవడంపై విద్యార్థుల తల్లులు ఆందోళన చెందుతున్నారు. అధికారంలోనికి వచ్చిన ఏడాది తరువాత కూటమి ప్రభుత్వం గత నెల 12న మొదటి విడత తల్లికి వందనం వేసిన సంగతి తెలిసిందే. అయితే మొదటి విడత జాబితాలో సుమారు 20 శాతం మందికి డబ్బులు పడలేదు. ఎందుకు పడలేదో ఇన్ఎలిజబుల్ లిస్ట్‌లో పేరులు చూసుకున్న లబ్ధిదారులకు నాలుగు చక్రాల వాహనం ఉందని, మూడెకరాల కంటే ఎక్కువ భూమి ఉందని, సరాసరి విద్యుత్ వాడకం నెలకు 300 యూనిట్ల కంటే ఎక్కువ ఉందని, ప్రభుత్వ ఉద్యోగం ఉందని, ఇన్‌కం టాక్స్ కడుతున్నారని తదితర కారణాలు చూపించి ఆ 20 శాతం మందికి అమ్మకు వందనం కోత పెట్టారు.

గ్రీవెన్స్‌లో పెట్టి ఎదురుచూపులు

చాలా మంది లబ్ధిదారులు గతంలో మాకందరికీ అమ్మ ఒడి పడిదంటూ సచివాలయాలకు వచ్చారు. సచివాలయ సిబ్బంది మీ పేరున ఏవైతే అభ్యంతరాలు వచ్చాయో అవి నిజం కాదని పత్రాలు తెచ్చుకుంటే అవి గ్రీవెన్స్‌లో పెడతామని చెప్పడంతో లబ్ధిదారులంతా సంబంధిత పత్రాలు తెచ్చి, ప్రభుత్వ ఉద్యోగం లేదని సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చి గ్రీవెన్స్ రైజ్ చేశారు. ఇలా గ్రీవెన్స్ రైజ్ చేసిన వారందరిని పరిశీలించి అర్హుల జాబితా జూన్ 30 విడుదల చేస్తామని చెప్పారు. తీరా జూలై మూడు వచ్చినా అర్హుల జాబితా ప్రకటించకపోవడంపై లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. దీంతో రెండు రోజులుగా జాబితా వచ్చిందా? అంటూ లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌లు రాలేదని చెప్పడంతో నిస్సహాతో వెనుదిరుగుతున్నారు. అందరికీ తల్లికి వందనం ఇస్తామని చెప్పి ఇప్పుడు అసలుకే ఎసరు పెడుతున్నారని తల్లులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

ఉండి: సీఐటీయూఆధ్వర్యంలో ఈ నెల 9న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను ప్రజలంతా విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ధనికొండ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టాలతో పాటు లేబర్‌కోడ్‌ను రద్దు చేసి కార్మికుల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

వైద్యుల సేవలు అమూల్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రాణం పోసేది అమ్మ అయితే..ఆపదలో ఉన్నప్పుడు ఆ ప్రాణాన్ని నిలిపేదీ వైద్యులేనని వారి సేవలు అమూల్యమని జేకామ్ భీమవరం చైర్మన్ పెరుమాళ్ల రామ్మోహన రావు, వైస్ చైర్మన్ పేరిచర్ల కృష్ణంరాజు తెలపారు. భీమవరం ఫాల్కన్ నెస్ట్ హోటల్లో బుధవారం జేకామ్ భీమవరం ఆధ్వర్యంలో డాక్టర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించి 11 మంది వైద్యులను సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని అన్నారు. సత్కార గ్రహీతలు మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి శ్రద్ధ వహించాలని, వ్యాయామం ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం పట్టణంలోని 11 మంది వైద్యులను జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో జే కామ్ భీమవరం సెక్రటరీ మధుబాబు, ట్రెజరర్ బొండాడ కృష్ణకాంత్, కోచ్ సంతోష్ సభ్యులు డాక్టర్లు పాల్గొన్నారు.

మూసివేసిన వాటర్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం

ఆకివీడు: స్థానిక ఆనాల చెరువు గట్టుపై మూసివేసిన నాంది వాటర్ (లయన్స్) ప్లాంట్‌లో బుధవారం తెల్లవారుజామున మంటలు వ్యాప్తి చెంది ప్లాంట్ కాలి బూడిదైంది. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో నాంది వాటర్ ప్లాంట్ నడిపారు. ప్రజలకు రక్షిత నీరందించేందుకు నడిపిన వాటర్ ప్లాంట్‌ను కొన్నాళ్ల తరువాత మూసివేశారు. మరికొన్నాళ్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దీనిని నడిపారు. అయితే నష్టాలు రావడంతో మూసివేశారు. గత కొన్నేళ్లుగా మూతపడి ఉన్న ప్లాంట్ వద్ద అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. మద్యం సేవించడం పరిపాటైందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి పారేసిన సిగరెట్ వల్ల గానీ, మద్యం పోసి నిప్పంటించి ఉంటారని స్థానికులు చెబుతున్నారు. అగ్నిప్రమాదం జరిగిన తరువాత ఆ ప్రాంత వాసి కిమిడి నాగరాజు అగ్నిమాపక అధికారులకు తెలియజేయడంతో వాహనం ఆ ప్రాంతానికి వచ్చే అవకాశం లేనందున స్థానిక యువకులు పక్కనే ఉన్న చెరువులోని నీటిని బకెట్లతో పోసి మంటల్ని అదుపు చేశారు. అగ్నిమాపక అధికారి జీ.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరుకుమిల్లిని ఆక్వా జోన్‌గా గుర్తించాలి

ఆకివీడు: ఉప్పుటేరు తీర ప్రాంతంగా ఉన్న చెరుకుమిల్లి గ్రామాన్ని పూర్తిగా ఆక్వా జోన్‌గా గుర్తించాలని ఆ ప్రాంత రైతులు మొరపెట్టుకున్నారు. మండలంలోని చెరుకుమిల్లి సచివాలయం వద్ద బుధవారం గ్రామ సభను సర్పంచ్ నందమూరి ప్రకాశం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభలో పలువురు రైతులు ఆక్వా జోన్ గుర్తింపును విస్తరింపజేయాలని కోరారు. ఉప్పుటేరుకు ఆనుకుని ఉన్న పంట భూములు సాగుకు పనికిరావడంలేదన్నారు. వరి సాగు చేసినా దిగుబడులు రావడంలేదని, పెట్టుబడులు అధికంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే గ్రామంలో కొంత మేర ఆక్వా చెరువులున్నాయన్నారు. పంట కాలువ ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న పంట నీటిలో సెలనిటీ అధికంగా ఉండటంతో సాగుకు పనికి రావడం లేదన్నారు. ఆయా కారణాల రీత్యా గ్రామం మొత్తం ఆక్వాజోన్‌గా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లతామని మత్స్యశాఖ ల్యాబ్ అసిస్టెంట్ కాస్త్రో తెలిపారు. జిల్లా రీసోర్స్ సభ్యురాలు బీహెచ్ రామలక్ష్మి వైస్ ఎంపీపీ సైదాల సూర్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షుడు మంతెన మురళీ కృష్ణంరాజు, ఎరిచర్ల సాంబర్లిన్, వేగేశ్న అర్జునరాజు, మంతెన రాంబాబు పాల్గొన్నారు.

వాసవీ మాత హుండీ ఆదాయం లెక్కింపు

పెనుగొండ: శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో హుండీ ఆదాయాన్ని బుధవారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. 100 రోజులకు రూ.5,76,505 ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాదికారి గుబ్బల రామ పెద్దింట్లురావు తెలిపారు. అన్నదానం హుండీ ద్వారా రూ.25,626 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. దేవాదాయ శాఖ తణుకు ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించినట్లు వివరించారు.